ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్‌గా నియమితులైన దేవినేని అవినాష్ గురువారం నందిగామలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కన్వీనర్‌గా తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన అవినాష్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగన్‌మోహనరావు ఘనంగా సత్కరించారు. –నందిగామ టౌన్

క్లుప్తంగా

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



శనగపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని శనగపాడు మునేరు ఇసుక రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మునేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను గ్రామంలో ఒకటి రెండు చోట్ల డంప్ చేస్తున్నారు. రాత్రిళ్లు లారీలు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ 3 నుంచి 4 లారీల ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ రవాణాతో రోడ్లు మొత్తం పాడవుతున్నాయని, మునేరులో తాగునీటి పథకాలు దెబ్బతింటాయని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. మండలంలో ప్రభుత్వం అధికారికంగా ఎక్కడా కూడా రీచ్ ఇవ్వలేదు. అయినా కూడా ఇసుక అక్రమ రవాణా సాగుతుండటంపై ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ఇసుక అక్రమ రవాణాపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అక్రమంగా ఇసుక తరలించేందుకు యత్నిస్తున్న లారీ, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్ గురువారం పేర్కొన్నారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని బలుసుపాడు గ్రామ సమీపంలో తెల్లవారుజామున ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లే సరికి పోలీసులను చూసి టిప్పర్‌లోని ఇసుకను కింద పోసి పక్కగా నిలుపుదల చేశారన్నారు. దీంతో లారీ, జేసీబీని స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకుని వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తప్పిపోయిన చిన్నారిని తల్లికి అప్పగించిన పోలీసులు



కంచికచర్ల: నాలుగేళ్ల చిన్నారి అంగన్‌వాడీ స్కూల్ నుంచి తప్పించుకుని తిరుగుతుండగా గురువారం పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ బోనగిరి రాజు కథనం మేరకు.. ఇందిరా కాలనీకి చెందిన బత్తుల నరేష్ అనే నాలుగేళ్ల చిన్నారి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. అక్కడి నుంచి బయటకు వచ్చి కంచికచర్లలో తిరుగుతున్నాడు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన తల్లిదండ్రులు చిన్నారి కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారిని పట్టుకుని తల్లికి అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులకు చిన్నారి తల్లి కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో వరద బాధితులకు బియ్యం, వంట నూనె, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ నేత శ్రీరాం చినబాబు తదితరులు పాల్గొని బాధితులకు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ అధికారుల అలసత్వంతో వరద నష్ట నమోదులో ఆలస్యం జరగడం వల్ల ప్రభుత్వం నుంచి నిత్యావసర సరుకులు బాధితులకు అందలేదన్నారు. ఎమ్మెల్యే సహకారం, దాతల వితరణతో కాలనీవాసులకు నిత్యావసరాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, వార్డు నాయకులు గద్దం రాంబాబు, యామర్తి బోసు పాల్గొన్నారు.



కోతకు గురైన దొడ్డదేవరపాడు-వీరులపాడు ఆర్‌అండ్‌బీ రహదారి



తోటమూల వద్ద కోతకు గురైన చప్టా



పల్లంపల్లిలో ఇసుక మేట వేసిన పంట పొలాలు

వెళ్లలేం..రాలేం..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా రహదారులు కోతకు గురవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. దీనికి తోడు డొంక రోడ్లు సైతం కోతకు గురవడంతో పంట పొలాలకు వెళ్లే వీలులేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో కూలీలు, ఎరువులు, పురుగు మందులు తదితరాలను తీసుకెళ్లడం ప్రాణాల మీదకు వస్తోందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. – వీరులపాడు



పల్లంపల్లి గ్రామంలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారి



భారీ వర్షానికి ధ్వంసమైన వైరా కట్టలేరు రహదారి



పెద్దాపురంలో కోతకు గురైన వ్యవసాయ భూములకు వెళ్లే డొంక రోడ్డు

30న కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



జగ్గయ్యపేట అర్బన్: కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్, కనీస వేతనాలు, చట్టాల అమలు కోసం ఈ నెల 30వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు తెలిపారు. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సోమేశ్వరరావు మాట్లాడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో 30న దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం డిమాండ్స్–డేను జరపాలని పిలుపునిచ్చిందని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు, పని గంటలు, సెలవులు, ఎలాంటి సంక్షేమ సౌకర్యాల అమలుకు నోచుకోకుండా కార్మికులు యంత్రాల్లా పనిచేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో విద్యుత్, ఆర్టీసీతో సహా అవుట్ సోర్సింగ్ పేరుతో లక్షల మందితో పనిచేయిస్తున్నారని వివరించారు. ఈ రంగాలన్నింటిలో పర్మినెంట్ చేయడం ప్రభుత్వాల యాజమాన్యాలదే బాధ్యత అని, పనిభద్రత లేకుండా, ఉన్న చట్టాలను అమలు చేయకుండా వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. కావున సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టర్ మారినా కార్మికులను కొనసాగించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్, సెలవులు, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హక్కులన్నీ తప్పక అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పేట మండల నాయకులు కోట రవి, రావెళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

పత్తి, మిర్చి పంటల్లో సస్యరక్షణ చర్యలు

భీమవరం(వత్సవాయి): పత్తి, మిర్చి పంటల్లో సస్యరక్షణ చర్యలు అవసరమని ఏడీఏ సి. భవాని పేర్కొన్నారు. గురువారం గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ, వ్యవసాయశాఖ, కేవీకే వారి సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు రెండు రోజులపాటు పత్తి, మిర్చి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ భవాని మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు పత్తి ఏడాదికి పంట మార్పిడిని తప్పకుండా మార్చుకోవాలన్నారు. అదేవిధంగా జీవ రసాయన ఎరువులను వాడాలని సూచించారు. విచ్చలవిడిగా మందులను వినియోగించకూడదని చెప్పారు. పత్తి ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న సందర్భంగా పురుగుల నివారణ కోసం లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలను ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. పత్తిలో తెల్లదోమ నివారణ కోసం వేపనూనె పిచికారి చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుపాటి మాధురి, డీడీ మనోజ్‌పూరీ గోస్వామి, ఎస్ కృష్ణంరాజు, వర్ధినీకుమారి, కే వీరయ్యచౌదరి, ప్రేమరంజిత, సురేష్, ఏఓ వీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ భవాని

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

నందిగామ టౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68వ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎంతో మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకు వస్తున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



నందిగామలోని జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సౌమ్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నందలూరు(వీరులపాడు): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని నందలూరు గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే ప్రభుత్వ పాలన సాగుతోందని అన్నారు. అనంతరం ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించి స్టిక్కర్‌లు అంటించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ కుమార్, దాములూరి మధుసూధనరావు, గురజాల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

నందిగామ టౌన్: ఆటో శుభ్రం చేస్తుండగా దొరికిన బంగారు గొలుసును ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించడంతో గురువారం వారు బాధితురాలికి అందజేశారు. సేకరించిన సమాచారం మేరకు.. కంచికచర్లకు చెందిన సబ్బుసాల లక్ష్మీతులసీ బుధవారం సాయంత్రం సమయంలో కంచికచర్ల నుంచి నందిగామలోని బంధువుల ఇంటికి వచ్చింది. రాత్రి సమయంలో తిరిగి రైతుపేట ఆటోస్టాండ్ వద్ద కంచికచర్ల వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఈ క్రమంలో తన మెడలోని గొలుసు ఆటోలో పడిపోయింది. గురువారం ఉదయం ఆటోను శుభ్రం చేసుకుంటున్న డ్రైవర్ నేకూరి సురేష్‌కు బంగారు గొలుసు దొరికింది. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆ గొలుసును అప్పగించడంతో సీఐ వైవిఎల్. నాయుడు వివరాలు తెలుసుకుని బాధితులను స్టేషన్‌కు పిలిపించి గొలుసు అందజేశారు. బంగారు గొలుసును అప్పగించిన డ్రైవర్ సురేష్‌ను సీఐ వైవిఎల్. నాయుడు, బాధితురాలు ఘనంగా సత్కరించారు.



ఆటో డ్రైవర్‌ను సత్కరిస్తున్న సీఐ, బాధితులు

మాజీ సర్పంచి నర్సయ్య విగ్రహావిష్కరణ

కంచికచర్ల: మండలంలోని గనిఆత్కూరులో మాజీ సర్పంచి కొమ్మినేని నర్సయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టీడీపీ జిల్లా నాయకుడు నెట్టెం రఘురాం గురువారం ఆవిష్కరించారు. ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్సయ్య గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశాడని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవాడని పేర్కొన్నారు. అటువంటి నాయకుడి విగ్రహాన్ని తమ చేతులమీదుగా ఆవిష్కరించడం అదృష్టమన్నారు. నర్సయ్య కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

పంట కుళ్లిపోయినా నమోదు చేయడం లేదు

మైలవరం: ఇటీవల కురిసిన వర్షాలకు వరద ముంపునకు గురై పెసర, మినుము పంటలు పూర్తిగా కుళ్లిపోయి నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం అంచనాలు నమోదు చేసేందుకు వచ్చిన వ్యవసాయ శాఖాధికారులు నష్టపోయిన పంట పొలాల ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదని మైలవరం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన రైతు వజ్రాల నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 200 ఎకరాలకు పైగా రైతులు పెసర పంట వేశారని, పెసరతో పాటు మినుము కూడా పూర్తిగా నీట మునగడంతో పంటలు పూర్తిగా కుళ్లిపోయాయని చెప్పారు. అధికారులు ఎన్యూమరేషన్ కింద ఒక్క ఎకరం కూడా రాయలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు. కొంత మంది అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల కొత్తగూడెం గ్రామంలో ఏ ఒక్కరికీ నష్టపరిహారం అందలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలని సూచించారు.



మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కొనసాగించాలి



నందిగామ టౌన్: మధ్యాహ్న భోజన పథకంలో పని చేసే కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలుపుదల చేయాలని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల అక్రమ తొలగింపులను నిరసిస్తూ గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లగా పని చేస్తున్న కార్మికులను తొలగించడం బాధాకరమన్నారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మధ్యాహ్న భోజన కార్మికులు, హెల్పర్‌లు, శానిటరీ వర్కర్స్, వాచ్‌మెన్‌లు తదితర చిరుద్యోగులను తొలగిస్తున్నారని ఇటువంటి చర్యలు మంచివి కావని పేర్కొన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాయక్, హుసేన్, దామోదర్, యూనియన్ నాయకులు ఏసోబు, కళావతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఉద్యమించాలి



వీరులపాడు: సమానత్వం, సాధికారతకు మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం, దేశ జనాభాలో మహిళలు సగ భాగం ఉన్నా ఇంటా బయట అనేక రకాల సాంఘీక వివక్షతకు, శారీరక, మానసిక దాడులకు గురవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలను అణిచి వేసే వైఖరే కొనసాగుతోందని అన్నారు. పురుషులతోపాటు అన్ని రంగాల్లో రాణించగలమని మహిళలు ఇప్పుడిప్పుడే రుజువు చేసుకుంటున్నారని వివరించారు. ఉత్పత్తి ప్రక్రియ నుంచి రాజకీయ స్థాయి వరకు సమాన భాగస్వాములైతేనే దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చాంద్‌బేగం, సరోజిని, లక్ష్మీప్రసన్న, సంధ్య, శ్రావణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ సేవలు చిరస్మరణీయం



మైలవరం: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దొరల దోపిడీ, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుద్ధవరపు వెంకట్రావు అన్నారు. మైలవరం పంచాయతీ అతిథి గృహంలో చిట్యాల ఐలమ్మ జయంతి కార్యక్రమం మైలవరం నియోజకవర్గ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ వీరోచితంగా పోరాడారని వివరించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని ఆటో స్టాండ్‌లో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు తాళ్లూరి శేషగిరిరావు, మైలవరం రజక సంఘం అధ్యక్షులు మల్లెల రాధాకృష్ణ, వార్డు సభ్యుడు మల్లెల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించండి సారూ..



పేటలోని విజయవాడ రోడ్డులో వేపలవాగు బ్రిడ్జిలో కలిసే కాలువలో వ్యర్థాలు



వేపలవాగు బ్రిడ్జి తూములకు అడ్డుపడిన వ్యర్థాలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ఊర చెరువుకు ప్రధాన నీటి సరఫరా చానెళ్లు ఎర్రకాలువ, వేపలవాగు. కాగా వాటి సమీపంలో నివాసం ఉండే ప్రజలు తమ గృహాల్లో వినియోగించే వ్యర్థాలను తరచూ ఎర్రకాలువలో గానీ, వేపలవాగు కాలువలో గానీ పడేస్తున్నారు. దీంతో అవి నీటి ప్రవాహానికి అడ్డుపడుతూ ఆ నీరు దిగువకు ప్రవహించకుండా ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఫలితంగా భరించలేని మురుగు కంపుతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కాగా ఇటీవల వరదల సమయంలో మున్సిపల్ సిబ్బంది ఎర్రకాలువ, వేపలవాగులో తూటుకాడ, గుర్రపుడెక్క వంటి వ్యర్థాలను తొలగించి వేసినప్పటికీ గృహాల్లో వినియోగించే వాటర్ బాటిల్స్ కాలువల్లో పడవేయడంతో అవి తూములకు అడ్డుపడుతూ నీటి ప్రవాహాన్ని నిరోధిస్తున్నాయి. కావున పురపాలక సంఘం అధికారులు స్పందించి ఎర్రకాలువ, వేపలవాగులతో పాటు, పట్టణంలోని వివిధ వీధుల డ్రెయిన్ల నుంచి వచ్చి వాటిలో కలిసేలా అనుసంధానించబడిన చిన్న కాలువల్లో కూడ వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఎర్రకాలువ, వేపలవాగులో తరచూ దోమల నివారణ మందు పిచికారీ చేయాలని కోరుతున్నారు.

4న బాలాలయం నిర్మాణానికి శ్రీకారం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన ఉన్న మఠం శివాలయం నవీన బాలాలయం నిర్మాణానికి వచ్చే నెల 4వ తేదీన శ్రీకారం చుట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ఆగమ సలహాదారు, దేవస్థాన స్థపతి వక్కావజల సుబ్రహ్మణ్య సిద్ధాంతి పేర్కొన్నారు. కంచి స్వామివారి ఆదేశాల మేరకు మఠం శివాలయాన్ని గురువారం సాయంత్రం సుబ్రహ్మణ్య సిద్ధాంతి పరిశీలించారు. ఇటీవల పాలేటికి వచ్చిన వరదల వల్ల కొట్టుకుపోయిన బాలాలయం స్థానంలో నవీన బాలాలయాన్ని నిర్మించి దేవతామూర్తులను, జీవ కలశాలను పునఃప్రతిష్ఠించి యథావిధిగా నిర్మాణాలు చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న నూతన దేవాలయం వరదలకు తట్టుకునే విధంగా తగు ఎత్తులో ఉందని, ఇబ్బందేమి లేదని తెలిపారు. నవీన బాలాలయం నిర్మాణ శ్రీకారానికి ఏర్పాట్లు చేయాలని కమిటీని ఆదేశించారు. నవీన బాలాలయం నిర్మాణమయ్యాక విగ్రహాలను ఏర్పాటుచేసి శాంతి హోమం, ప్రాయశ్చిత్త విధులను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రముఖులు, నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్య సిద్ధాంతి

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

విస్సన్నపేట: విద్యార్థులు ఇష్టంతో చదివినప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలరని తిరువూరు కోర్టు జడ్జి సిందూర అన్నారు. నరసాపురం గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవిజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. కోర్టుకు వచ్చేందుకు భయపడాల్సిన పనిలేదని చెప్పారు. పోక్సో కేసుకు సంబంధించి స్నేహపూర్వక వాతావరణంలో ఉండే విధంగా కోర్టు డిజైన్ చేశారన్నారు. ఈ కేసులను మహిళా జడ్జీలు పరిశీలిస్తారన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను వివరించారు. కార్యక్రమంలో తిరువూరు కోర్టు సీనియర్ లాయర్లు లక్ష్మీనారాయణ, జనార్దనరావు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, ఎస్ఎంసీ చైర్మన్ సరస్వతి, గ్రామ ప్రముఖుడు జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సిందూర

CHANGE OF NAME

I, **KOPURI RAMADEVI,** W/o KOPURI HANUMANTHARAO, D.No. 2-77/B, Main Road, OC Colony, Chevitikallu, Kanchikacharla Mandal, NTR District, Andhra Pradesh. 521180. In my passport (No: Y5653727) my husband name is wrongly entered as **KOPURI HANUMANTHURAO** (Wrong Name). His actual and Correct name is **KOPURI HANUMANTHA RAO** (Correct Name) for all purposes.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నందిగామ డివిజన్

79950 92114 (నందిగామ)

99122 20547 (జగ్గయ్యపేట)

Office mail : sakshiads@gmail.com